క్లుప్తంగా

లయన్స్ క్లబ్‌లో 'ఆర్థోపెడిక్' శిబిరం



శిబిరంలో పాల్గొన్న క్లబ్ బాధ్యులు, వైద్యులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గట్టయ్యసెంటర్‌లో ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఆర్థోపెడిక్ శిబిరం నిర్వహించారు. యశోద హైటెక్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ కీర్తి పాలడుగుచే ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని పీఎంజేఎఫ్ లయన్ డాక్టర్ రాఘవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లికొండ శ్రీనివాసరావు, గెల్లా శ్రీరామ్, డీసీపీ రావు, దుర్గా నాగేశ్వరరావు, వెంకయ్య, కృష్ణమూర్తి, సుదర్శన్, గోంగూర వెంకటేశ్వర్లు, గోవర్ధన్, యశోద గిరి, బాలరాజ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండల కేంద్రంలో స్థానిక నూతక్కి గంగాధర్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మొత్తం 158 మంది రోగులకు వైద్య సేవలు అందించి నెలకు సరిపడా మందులు రూ.100 లకు అందించారు. మరో 39 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల వైద్యుడు, ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు, కార్యదర్శి చెరువు నరసింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు, దండా సూర్యనారాయణ, జమాల్‌పాషా, షేక్ అబ్దుల్, మంకెనపల్లి నరసింహారావు, రామారావు, మల్లిఖార్జున్, నాగేశ్వరరావు, గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈవెంట్‌లకు అనుమతి లేదు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో రానున్న హోలీ పండుగను పురస్కరించుకుని ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందని, అలాంటి అసంబద్ధమైన వాటికి అనుమతి, తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈవెంట్‌లకు ఎవరికీ, ఎటువంటి అనుమతి ఇవ్వలేదన్నారు. ఈవెంట్ పేరుతో పాశ్చాత్య నృత్య ప్రదర్శనలు, అసాంఘిక ప్రదర్శనలకు టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని, దీనిని ఖండిస్తున్నామన్నారు. ఏ కార్యక్రమానికైనా పోలీస్ అనుమతి తీసుకోవాలనే నిబంధన ఉంటుందన్నారు.

నివాళి..



నివాళులర్పిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వేణు

తిరుమలాయపాలెం: మండలంలోని మేడిదపల్లి మాజీ సర్పంచ్ బండ్ల సురేష్ మాతృమూర్తి బండ్ల లక్ష్మమ్మ ఆదివారం మృతిచెందింది. ఈమేరకు ఆమె మృతదేహాన్ని డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు సందర్శించి నివాళులర్పించి లక్ష్మమ్మ కుమారులు సురేష్, నాగేశ్వరరావులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ మంచానాయక్, బీఆర్ఎస్ నాయకులు అర్మి రవి, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిమ్మపుడి గ్రంథాలయానికి విరాళం

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో గత కొంతకాలంగా గ్రామంలో ఎవరు వివాహం చేసుకున్నా గ్రామ సెంటర్‌లోని ఇటుకల విశ్వనాథచారి పేరున ఉన్న గ్రంథాలయానికి ఆర్థిక సాయం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈనేపథ్యాన ఆదివారం నూతనంగా పెళ్లయిన సచ్చు గోపీకృష్ణ, శృతి దంపతులు గ్రంథాలయానికి రూ.5,116 అందించారు. ఇప్పటి వరకు 60 మందికి పైగా ఇలా సాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఛావా సినిమా ఉచిత ప్రదర్శన

ఖమ్మంగాంధీచౌక్: ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రపై రూపొందించిన 'ఛావ'సినిమాను బీజేపీ ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని వినోద టాకీస్‌లో ఉచితంగా ప్రదర్శించారు. బీజేపీ నాయకులు కాషాయ కండువాలు ధరించి, జెండాలు చేతబూని సినిమాను వీక్షించి థియేటర్ ఎదుట శివాజీ ధీరత్వాన్ని కొనియాడుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవకి వాసుదేవరావు, సన్నే ఉదయ్ ప్రతాప్, రవీందర్‌రావు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిన పద్మశాలీలు..

రఘునాథపాలెం: పద్మశాలీలు తలపెట్టిన చలో హైదరాబాద్ మహాసభకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన పద్మశాలీల సోదరులు ఆదివారం తరలివెళ్లారు. ప్రత్యేక బస్సు ద్వారా అఖిల భారత పద్మశాలి రాష్ట్ర 8వ మహాసభకు నాయకులు కనకయ్య, అదోరణ, వెంకటేశ్వర్లు, సురేష్, పిచ్చయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, శంకర్ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

అసాంఘిక శక్తుల అడ్డా..

మయూరిసెంటర్ బ్రిడ్జి వద్ద గంజాయి, మద్యం మత్తులో నిత్యం ఘర్షణలు

- మహిళలు తలవంచుకునేలా కాల్‌గర్ల్స్ ప్రవర్తనలు
- ఒంటరిగా ప్రయాణించేందుకు జంకుతున్న జనం
- కరువైన పోలీసుల పెట్రోలింగ్



మయూరిసెంటర్ బ్రిడ్జి కింద విటులను ఆకర్షిస్తున్న కాల్‌గర్ల్స్

ఖమ్మంక్రైం: ఖమ్మం నగరంలో నడిబొడ్డున ఉన్న మయూరిసెంటర్ బ్రిడ్జి ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆ ప్రాంతమంతా వ్యభిచారంతో పాటు గంజాయి, మద్యం సేవించి నిత్యం ఘర్షణలు నిలయంగా మారింది. దీంతో ఆప్రాంతంలో నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెడ్ లైట్ ఏరియాగా..

నగరంలో రాత్రయితే చాలు మయూరిసెంటర్ నుంచి బ్రిడ్జి కింది ప్రాంతం చిన్నపాటి రెడ్‌లైట్ ఏరియాగా మారింది. ఆప్రాంతంలో కాల్‌గర్ల్స్ నిలబడి అసభ్యంగా ప్రవర్తిస్తూ విటులను ఆకర్షిస్తుండడం, వారి కోసం మత్తులో ఘర్షణపడి కొట్టుకోవడం పరిపాటిగా మారింది. కాగా, ఆ ప్రాంతంలో ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉండడంతో సాయంత్రం నుంచి రాకపోకలు సాగించేవారు ఈ గొడవలతో పాటు కాల్‌గర్ల్స్ ప్రవర్తనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు తలవంచుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది.

పట్టించుకోని పోలీసులు..

మయూరిసెంటర్‌లో ఓ వైపు వన్‌టౌన్, మరో వైపు టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోకి వస్తున్న ఈ ప్రాంతంపై పోలీసుల నిఘా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు పెట్రేగిపోతున్నాయి. ఈ ప్రాంతంలో సంబంధించిన పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడం, పట్టించుకోకపోవడంతో అంతా చట్టవిరుద్ధమైన పనులు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ముఖ్యంగా చీకటిపడితే చాలు ఆప్రాంతం గుండా వెళ్లడానికి ప్రజలు వణికిపోతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు అదే ప్రాంతంలో ఓ సినిమా థియేటర్ ఉండడంతో సెకండ్ షో వెళ్లిన వారు మామిళ్లగూడెం, బుర్హాన్‌పురం ప్రాంతాలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగిపోతున్నారు. అంతేకాక ఒంటిరిగా వెళ్తున్న వారిని బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్లు సైతం లాక్కొంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి సైతం కాల్‌గర్ల్స్ ను బ్రోకర్లు తీసుకొచ్చి విటులతో పంపిస్తున్నట్లు తెలిసింది. వీరి కోసం యువకులు, నడివయస్కులు, వృద్ధులు సైతం రావడం, ఘర్షణ పడడం పరిపాటిగా మారిందని ఆప్రాంతం నుంచి వెళ్లేవారు చెబుతున్నారు.

ఆ ప్రాంతంలో నిలబడలేక..

ఎప్పుడు రద్దీగా ఉండే మయూరిసెంటర్ ప్రాంతానికి వివిధ రకాల పనులతో నిత్యం వందలాది మంది మహిళలు, యువతులు వచ్చి పోతుంటారు. వారు తెలియక బ్రిడ్జి కింద ప్రాంతంలో నిలబడిన లేదా ప్లాట్ ఫాంపై ఉన్నా, తమవారి కోసం వేచిచూస్తున్నా.. వారిని కూడా పలువురు తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితికి వచ్చిందంటే అసాంఘిక కార్యకలాపాలు ఏ రీతిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో చర్యలు చేపట్టకపోతే ముందుముందు మరిన్ని దారుణాలు జరిగే అవకాశం ఉంది.

> వారం రోజుల క్రితం ఓ యువతి బ్రిడ్జి కింద ప్రాంతంలో గల ఓ ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రి చిరునామా సరిగ్గా తెలియకపోవడంతో తమ వారికి ఫోన్ చేయగా బ్రిడ్జి కింద ఉండమని చెప్పగా.. ఆమె అలాగే వేచి ఉండడంతో ఓ మధ్య వయస్కుడు ఆమెను కాల్‌గర్ల్ అనుకొని అసభ్యంగా మాట్లాడారు. దీంతో ఆ యువతి తమ వారికి ఫోన్ చేయగా వారు అక్కడకు చేరుకుని ఆ వ్యక్తికి దేహశుద్ధి చేయగా.. పారిపోయినట్లు తెలిసింది.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఖమ్మంమయూరిసెంటర్: పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఆదివారం శివాయిగూడెం ఇళ్ల స్థల సమస్యపై పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెం వద్ద అనేకమంది పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, ఆ స్థలాల్లో ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదన్నారు. ఆ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టలేదనే కారణం చూపుతూ స్థలాలను బై బ్యాక్ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారని, దీంతో బాధితులు ఆందోళన చెందారని అన్నారు. ఈ నేపథ్యాన సీపీఎం బృందం అధికారులతో చర్చలు జరపగా ఒరిజినల్ పట్టాలు కలిగిన వారికి ఇల్లు నిర్మించుకునే అవకాశం, ఇప్పటికే నివాసం ఉంటున్న ఇళ్ల జోలికి వెళ్లమని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ చర్చల్లో ఖమ్మం ఆర్డీఓ, ఏసీపీ, రఘునాథపాలెం ఎంఆర్‌ఓ లూథర్ విల్సన్, రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్ రెడ్డి, ఎస్‌కె.మీరాసాహెబ్, ఎంఏ జబ్బార్, నాయకులు షేక్ నాగులు మీరా, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్నాటి వీరభద్రం, కార్యదర్శిగా విజ్రంపర్తి చంద్రశేఖర్‌లను ఎన్నుకోగా వీరువీరు 2028 వరకు కొనసాగనున్నారు. అంతేకాక కోశాధికారిగా జట్ల శ్రీనివాసరావు, సీనియర్ ఉపాధ్యక్షుడిగా కమర్తపు మురళి, ఉపాధ్యక్షులుగా బాలసాని ఆనంద్, దుద్దుకూరి సత్యనారాయణ, కొంగర శ్రీనివాస్, రెగ్గళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా చావా వెంకటేశ్వరరావు, కొల్లి రమేష్, రవిబాబు, వై.రమణ, కార్యవర్గ సభ్యులుగా మందడపు అనిల్, వి.సాయికృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, వై.పాపారావు, ఎన్. నవీన్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డిలుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంట వెంకట్రావు, హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత, మాజీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు పి.రవిమారుత్, పి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నూతన కార్యవర్గం రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారిణి చరితశ్రీకి రూ.10వేల నగదు అందజేశారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం

ఖమ్మం రూరల్: యువత పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని గూడురుపాడులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని ఆరోపించారు. యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతుంటే పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగంచేస్తున్నాయని ఆరోపించారు. యువత మేధోశక్తిని కార్పొరేట్లకు అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రతీ గ్రామం నుంచి యువతను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకులు సిద్దినేని కర్ణకుమార్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మామిండ్ల శ్రీనాథ్, ఉసికల రవి, మామిడాల కిరణ్ పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ప్రభుత్వం ఎలాంటి నియామకాలు చేపట్టకూడదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పగిడికత్తుల ఈదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం ఆధ్వర్యాన మండల కేంద్రంలో డప్పుల ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మాదాసి వెంకన్న, నాయకులు పొట్టపింజర బాలస్వామి, తోళ్ల సురేష్, తోళ్ల వెంకన్న, రాజేష్, గురవయ్య, వీరస్వామి, వినయ్, వీరబాబు, భరణి, సుధాకర్, సంఘీభావంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు రాంబాబు, ఆదాం, శ్రీను, ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సీ బాలుర వసతి గృహ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులో గల ఎస్సీ బాలుర వసతి గృహ సముదాయం(హాస్టల్ డే) వార్షికోత్సవ వేడుకలను హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఖమ్మం జిల్లా డీడీ కస్తాల సత్యనారాయణ, టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు అట్లూరి వెంకటరమణ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుంటూ, మంచి పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో ప్రతీ ఏడాది వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీజీవోస్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, నాయకులు గంగవరపు బాలకృష్ణ, జయపాల్, ఎర్ర రమేష్, తాళ్లూరి శ్రీకాంత్ పెద్దినేని రాధాకృష్ణ, భూస చంద్రశేఖర్, ఎన్.విజయ, ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓ అబ్దుల్ రవూఫ్, సంక్షేమ అధికారుల ఫోరం బాధ్యులు నెల్లూరి నాగేశ్వరరావు, కె.తిరుపతిరావు, సంక్షేమ అధికారులు టి.స్టాలిన్, ఎస్.వెంకటరెడ్డి, జి.వరలక్ష్మి, వై.మల్లారెడ్డి, ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ చేసిన పువ్వాడ



నిత్యావసరాలు అందిస్తున్న అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరీమణులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆదివారం నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులోని మక్కా మస్జీద్ వద్ద జనాబ్ ముఫ్తి ఫరూక్ మదాని ఆధ్వర్యాన పువ్వాడ వీటిని అందజేశారు. అలాగే నగరంలోని 58వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వేముల రవి ఇటీవల కంటి చికిత్స చేయించుకోగా ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ పరామర్శించారు. పగడాల నాగరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, నాయకులు ఉన్నారు.

నియామకాలు..

● బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుడిసె సాల్మన్ బాబు

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుడిసె సాల్మన్ బాబును నియమిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఆదివారం ఖమ్మం సంఘ కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు ఈట వీడీఐ రాజీవ్ రాజ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాల మహానాడు ఇన్‌చార్జ్ దామల్ల సత్యం, కొప్పుల రామారావు, దారా ఆనంద్‌కుమార్, రత్నం, చిన్నప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

● మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా కొప్పుల రామారావు

మాలమహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొప్పుల రామారావు, ప్రధాన కార్యదర్శిగా చప్పిడి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శిగా గుడిబండ్ల వెంకట్ నియమితులైనట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఎర్రమల రాములు నియామక పత్రాలు అందజేశారు. ఆదివారం ఖమ్మం అంబేద్కర్ భవన్‌లో నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా దోకుపర్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పులగం రాజా, కార్యదర్శిగా పేరంపల్లి మధుకుమార్, జిల్లా మహిళ కన్వీనర్‌గా నిమ్మతోట రోజా, నగర యువజన విభాగం అధ్యక్షుడిగా పేరం యశ్వంత్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా అన్ని విధాలుగా కేంద్ర, రాష్ట్ర కమిటీలకు కట్టుబడి పనిచేస్తామని కమిటీల సభ్యులు ప్రమాణం చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గం సభ్యులు దామల సత్యం, గుడిసె సాల్మన్‌రాజ్, రాజీవ్, లింగాల రవికుమార్, రాము, మోహన్ రాజు, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

● యునైటెడ్ ముస్లిం యూత్ మూవ్‌మెంట్ అధ్యక్షుడిగా ఇమాదుద్దీన్

యునైటెడ్ ముస్లిం యూత్ మూవ్‌మెంట్ అధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన సయ్యద్ ఇమాదుద్దీన్, కార్యదర్శిగా ఉమర్ షరీఫ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆదివారం ఖమ్మం జమాతె ఇస్లామీ హింద్ అజీజ్ గల్లి కార్యాలయంలో జమాతె ఇస్లామీ హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ మజీద్‌షోయబ్, జిల్లా అధ్యక్షుడు జైనుల్ పాషా ఆధ్యర్యాన ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోతఊజ్ షరీఫ్, అబ్దుల్లా, యాసర్, పర్వేజ్, ఇర్షాద్, ఇజాజ్, హనీఫ్, అనస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రారంభం, ధ్వజస్తంభం, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తుల జై శ్రీరామ్ నినాదాల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠను వేదపండితులు పూర్తిచేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయంలో సీతారామచంద్ర స్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠతో పాటు ఆంజనేయ స్వామి, కామాక్షి సహిత ఏకాంబేశ్వరస్వామి, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన తుమ్మల వెంకటేశ్వరరావు సారథ్యాన ఆలయ ప్రారంభోత్సవం పూర్తిచేయగా భక్తులకు నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిపారు. అర్చకులు సుగంధ రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించి రాత్రి మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపారు. వేలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. స్వామి వారిని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా.. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషినల్ డీసీపీ లాండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు పర్యవేక్షించారు. నేడు శివపార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రైతు ఉద్యమాలకు సిద్ధం కండి

కూసుమంచి: ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ అనుబంధ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. మండలంలోని గైగోళ్లపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వంలో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు, కార్పొరేట్లకు లాభం చేకూర్చేందుకు నల్లచట్టాలను తీసుకొచ్చి దొడ్డి దారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ రంగానికి జరిగే నష్టాన్ని రైతులు గ్రహించాలని, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతులకు నూరు శాతం రుణమాఫీ చేయాలని, రైతు భరోసా అందరికీ అందించాలని కోరారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా భూక్యా ప్రసాద్, కార్యదర్శిగా జిల్లా సైదులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు మిడకంటి వెంకటరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నర్సింహా, ఉపేందర్‌రెడ్డి, పాండురంగాచారి, పిచ్చయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో ఎడ్యుకేషన్ సెమినార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, యాజమాన్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని పుట్టకోట రోడ్డులో ఉన్న శ్రీచైతన్య గ్లోబల్ విస్తా క్యాంపస్‌లో ఆదివారం ఎడ్యుకేషన్ సెమినార్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి విజేతలుగా నిలవడం కోసం గ్లోబల్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరమని పేర్కొంటూ 'ఫీచరిస్టిక్ గ్లోబల్ ఎడ్యుకేషన్ –బియాండ్ బౌండరీస్'అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్లెంపాటి సాయిగీతిక తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యాసంస్థల ఏజీఎంలు, కోఆర్డినేటర్లు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

ఖమ్మంమామిళ్లగూడెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మం వాసవీ శివాలయం క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం ఐదుగురు మహిళలకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సుగ్గాలా శ్రీహరి, కార్యదర్శి కొదుమూరి భద్రయ్య, కోశాధికారి వల్లాల యుగంధర్‌లు పాల్గొన్నారు. అలాగే సాయి గణేష్ నగర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథం ఆధ్వర్యాన 30 మంది మహిళలకు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సీతంపేట గ్రామంలోని గజగిరి లక్ష్మీనరసింహస్వామి, పానకాల స్వామి దేవాలయానికి రూ.10వేల విలువైన గుడిగంటను బాధ్యులకు అందజేశారు. అంతర్జాతీయ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ కడవెండి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ గుమ్మడవల్లి శ్రీనివాస్, క్యాబినెట్ సెక్రటరీ గోళ్ల రాధాకృష్ణమూర్తి, వైస్ గవర్నర్ మాశెట్టి వరప్రసాద్ పాల్గొన్నారు.

స్త్రీ శక్తి అవార్డులు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పౌర సమితి, మహాత్మా గాంధీ ఫౌండేషన్, పులిపాటి నగర్ వాసవీ క్లబ్, పులిపాటి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మం వైరా రోడ్‌లో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం 18 మంది మహిళలకు స్త్రీ శక్తి అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా పౌర సమితి అధ్యక్షుడు పులిపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత పదేళ్ల నుంచి అనేక రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళలను గుర్తించి సేవా అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. షేక్ ఖాసీమ్, వరప్రసాద్, బొగ్గవరపు సతీష్, పసుమర్తి శ్రీనివాస్, శ్రీకాంత్, కృష్ణమూర్తి, పద్మజారెడ్డి, శ్రీకళారెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్‌కు..

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంకు చెందిన పారా లీగల్ వలంటీర్ కొలిపాక నాగమణికి సామాజిక సేవా పురస్కారం లభించింది. కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన పురస్కారాలను అందించారు. ఈ మేరకు ఆమెకు అవార్డు అందించి ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ చైర్మన్ ఇటికాల వీరయ్య మాట్లాడుతూ.. నాగమణి జిల్లాలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలిచారని, ఆమె స్ఫూర్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

విద్యుత్ సిబ్బంది సేవలకు గుర్తింపు..



విద్యుత్ ఉద్యోగులను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సిబ్బంది సేవలకు గుర్తింపుగా నగరంలోని మధురానగర్ చెరుకూరి మామిడితోట రోడ్డులో పలువురు అధికారులు, ఉద్యోగులు, కార్మికులను కాలనీవాసులు ఆదివారం సత్కరించారు. కాలనీలో మారుమూలగా ఉన్న ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్యలపై స్థానిక కార్పొరేటర్ కూరాకుల వలరాజు ఆధ్వర్యాన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. అప్పటి ఎస్ఈ సురేందర్, టౌన్ డీఈ నంబూరి రామారావు తదితరులు సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. అనతికాలంలోనేఈ ప్రాంతానికి త్రీఫేజ్‌ను సరఫరా చేశారు. దీంతో కాలనీవాసులు కలవకొలను హరీష్‌రాజు, బొగ్గవరపు నాగేశ్వరరావు, పాపినేని వెంకటేశ్వరరావు, షేక్ మొహీనుద్దీన్, హుస్సేన్, జానీపాషాలు టౌన్ డీఈ ఎన్ రామారావు, ఏడీఈ యాదగిరి, ఏఈ లక్ష్మణ్‌రావు, ఎస్ఎల్ఐ మందడపు సత్యనారాయణ రెడ్డి, ఎల్ఐ సతీష్, ఎల్ఎం ఉపేందర్, ఏఎల్ఎంలు రామకృష్ణ, ప్రదీప్, వెంకటనారాయణ, అనిల్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, అల్పాహార విందు ఇచ్చారు.

ఎల్ఓసీ అందజేత

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన షేక్ అక్బర్ శస్త్ర చికిత్స కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసు మేరకు మంజూరైన రూ.3 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని ఆదివారం క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి అందించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంలో జరుగుతున్న ప్రైవేట్ మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన జిల్లా అధ్యక్షుడు సీహెచ్.నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ఖమ్మం జిల్లా కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో అక్రమంగా అబార్షన్లు చేస్తూ కడుపులోనే శిశువులను హత్య చేస్తున్నారని, ఈ రకమైన చర్యలకు అన్ని రకాల ప్రజా సంఘాలు, అన్ని పార్టీలు కలిసి ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు మాట్లాడుతూ.. మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల పేర్లతో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని, ఇటువంటి వారిపై తక్షణమే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, లింగాల రవికుమార్, భద్రూనాయక్, రవిచంద్ర చౌహన్, కిషన్‌నాయక్, కె.రాంబాబు, వీరనారీమనుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్రబాయి, ఆప్ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు, పీపుల్స్ జేఏసీ ఖమ్మం జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, పసుపులేటి నాసరయ్య, కొట్టే సుధాకర్, టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు రాజేందర్, ఎం.సురేష్, పెళ్లూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.